సాక్షి
అనంతపురం
గురువారం | 7 | డిసెంబర్ | 2023



కీచక గురువు మాకొద్దు

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న టీచర్ తమకు వద్దని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. 8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
34.7°/19.5°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. తుపాను వాతావరణం తగ్గిపోవడంతో ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

క్రీడాస్ఫూర్తి చాటండి: డీఆర్ఎం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు: గెలుపోటములను సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తి చాటాలని క్రీడాకారులకు డీఆర్ఎం మనీష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే క్రీడా మైదానంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఇంటర్ డిపార్టుమెంట్ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నిరంతర విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న సిబ్బందికి ఆటవిడుపుగా క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడా వందనం స్వీకరించి, జ్యోతి వెలిగించడం ద్వారా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, సీనియర్ డీసీయం మనోజ్ పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట నష్టం రూ.251.20 కోట్లు



దెబ్బతిన్న వేరుశనగ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఖరీఫ్ పంట నష్టం రూ.251.20 కోట్లుగా తేల్చారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రకృతి విపత్తుల విభాగం నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 28 మండలాలను కరువు జాబితాలో ప్రకటించిన విషయం తెలిసిందే. కరువు మండలాల్లో ఈ-క్రాప్ ఆధారంగా 33 శాతం కన్నా ఎక్కువగా నష్టం జరిగిన పంట వివరాలు ఆర్బీకే వేదికగా గత 15 రోజులుగా సేకరించారు. తుది జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శించి సామాజిక తనిఖీ ద్వారా రైతుల నుంచి అభ్యంతరాలు కూడా స్వీకరించారు. సమగ్ర కరువు నివేదికను బుధవారం కలెక్టర్ ఎం.గౌతమి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) రూపంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా రెండు హెక్టార్ల (5 ఎకరాలు) వరకు పరిహారం వర్తింపజేయనున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం వేరుశనగ, పత్తి పంటలకు సంబంధించి స్కేల్ ఆఫ్ రిలీఫ్ (పంటనష్ట ఉపశమనం) హెక్టారుకు రూ.17 వేలు, జొన్న, సజ్జ, ఆముదం పంటలకు హెక్టారుకు రూ.8,500, కంది, ఇతర ఆపరాలు, పొద్దుతిరుగుడు, సోయాబీన్ పంటలకు హెక్టారుకు రూ.10 వేలు, మొక్కజొన్న హెక్టారుకు రూ.12,500 ప్రకారం స్కేల్ ఆఫ్ రిలీఫ్ వర్తిస్తుందని పేర్కొన్నారు. మొత్తం మీద కరువు జాబితాలో ఉన్న 28 మండలాల పరిధిలో 1.79 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతినడంతో 1.69 లక్షల మంది రైతులకు రూ.251.20 కోట్లు నష్టం జరిగినట్లు నివేదించారు.

ఆయువు నిలిపిన ఆరోగ్యశ్రీ

- టీడీపీ పాలనలో పథకం నిర్వీర్యం
- ఉమ్మడి జిల్లాలో 99 వేలమందికే లబ్ధి
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పటిష్టం
- గడిచిన నాలుగున్నరేళ్లలో 3.73 లక్షల మందికి వైద్య సేవలు
- ఆరోగ్య ఆసరా కింద 1.78 లక్షల మంది లబ్ధిదారులకు ఆర్థిక భరోసా
- ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఆరోగ్యశ్రీపై 'ఈనాడు' తప్పుడు రాతలు



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద గుండె ఆపరేషన్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఫ్యాక్ట్ చెక్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సరిగ్గా నాలుగున్నరేళ్లకు ముందు రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం కింద సరైన వైద్యం లభించక బాధితులు పడిన వేదన అంతా ఇంతా కాదు. ముఖ్యంగా మెట్ట వ్యవసాయం, కూలిపనులను నమ్ముకుని బతుకీడుస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులు లేకపోవడంతో ఏ ఆస్పత్రికెళ్లినా బాధితులను చూసి ఈసడించుకోవడమే. క్యాన్సర్, గుండెజబ్బు బాధితులు ఇతర రాష్ట్రాలకు వెళితే వైద్యం అందేది కాదు. ఇలా ఒకటి కాదు రెండు కాదు రకరకాల సమస్యలతో బాధితులకు ఐదేళ్ల కాలం ఐదు యుగాలుగా గడిచింది. 2019 మే 30న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రకరకాల జబ్బులతో బాధపడుతూ చికిత్సలకు ఎదురు చూస్తున్న వారికి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేసి ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చింది. ఎంతోమంది పేదలకు సకాలంలో వైద్యం అందడంతో ఆయుష్షు పెరిగింది.

భారీగా చికిత్సలు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఆంక్షలు తొలగిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వెళ్లి చికిత్సలు చేసుకునే వెసులుబాటు లభించింది. 1,044 మాత్రమే ఉన్న ప్రొసీజర్ల సంఖ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3,256కు పెంచింది. దీంతో ఏ జబ్బు వచ్చినా నిర్భయంగా కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకునే అవకాశం దక్కింది. తెలుగుదేశం పార్టీ హయాంలో అనంతపురం జిల్లాకు 2014–19 మధ్య కాలంలో రూ.275.57 కోట్లు ఆరోగ్యశ్రీ కింద వ్యయం చేయగా.. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.673.02 కోట్ల వ్యయం చేశారు. అప్పట్లో లబ్ధిదారులు 99వేల మంది పైచిలుకు మాత్రమే ఉంటే.. ఈ ప్రభుత్వ హయాంలో 3.73 లక్షల పై చిలుకు పెరిగారు.

భరోసా ఇచ్చిన ఆసరా

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా.. ఇలాంటి పథకం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు. చికిత్స అనంతరం కుటుంబ పెద్ద మంచం మీద ఉంటే పోషణ కష్టమన్న భావనతో కోలుకునే వరకూ రోజుకు గరిష్టంగా రూ.225 లెక్కన ఇస్తోంది. ఇలా ఈ నాలుగున్నరేళ్లలో ఆరోగ్య ఆసరా కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1.78 లక్షల మంది లబ్ధిపొందగా, దీనికోసం రూ.91.32 కోట్ల వ్యయం చేశారు.

ఈనాడు తప్పుడు రాతలు

రాష్ట్రవ్యాప్తంగా గుండె జబ్బులు సరిగా జరగడం లేదని, ఇక్కడ ప్యాకేజీలు తక్కువగా ఉన్నాయని ఈనాడు పత్రిక అచ్చు వేసింది. కామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగానే ఉంటుందన్న చందంగా రాసింది. కానీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క గుండె చికిత్సలకే రూ.129.34 కోట్ల వ్యయం చేసింది. దీన్నిబట్టి ఇక్కడ గుండెజబ్బు బాధితులు ఎలా లబ్ధి పొందారో అంచనా వేయచ్చు. ఇవేమీ చూడకుండా ప్యాకేజీలు తక్కువని, ప్రైవేటు ఆస్పత్రులు ఒప్పుకోవడం లేదంటూ 'ఈనాడు' తప్పుడు కథనంతో ప్రభుత్వంపై బురద జల్లే రాతలు రాసింది.

టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు

కాల వ్యవధి	2014-2019
మొత్తం చికిత్సలు	1,044
లబ్ధిదారుల సంఖ్య	99,895
ఆరోగ్యశ్రీ వ్యయం	రూ.275.57 కోట్లు
ఆరోగ్య ఆసరా	0

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు

కాల వ్యవధి	2019-2023
మొత్తం చికిత్సలు	3,256
లబ్ధిదారుల సంఖ్య	3,73,735
చేసిన వ్యయం	రూ.673.02 కోట్లు
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు	1,78,165
ఆసరాకు చేసిన వ్యయం	రూ.91.32 కోట్లు

కాలవ శ్రీనివాసులుకు మతి భ్రమించింది

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



తాడిపత్రి: జిల్లాలో కొనసాగుతున్న సామాజిక సాధికార యాత్రలకు అశేష ప్రజలు తరలివస్తుండడం చూసి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులుకు మతిభ్రమించిందని, దీంతో తనకు ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. బుధవారం తాడిపత్రిలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే తమకు న్యాయం జరుగుతుందని విశ్వసించిన ప్రజలు సామాజిక సాధికార యాత్రకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ అంశాన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. తామెన్ని కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకురాలేమని నిర్ధారించుకున్న కాలవకు పిచ్చెక్కి వైఎస్సార్‌సీపీపై బురద చల్లేందుకు సిద్ధమయ్యాడన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ గురించి మాట్లాడే నైతిక హక్కు కాలవకు లేదన్నారు. 2014 నుంచి 2019 వరకు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ, పయ్యావుల కేశవ్, దేవినేని ఉమ, సుజనా చౌదరి, జేసీ బ్రదర్స్ లాంటి అనేక మంది పెత్తందారుల చేతిలో బడుగు, బలహీన వర్గాల నాయకులు, ప్రజలు నలిగిపోయిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సామాజిక న్యాయానికి జగన్ ప్రభుత్వం రోల్ మోడల్‌గా మారిందన్నారు. దీనిపై ఎలాంటి అనుమానాలు ఉన్నా బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.

ఆదర్శప్రాయులు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావితరాలకు ఆదర్శప్రాయులని కలెక్టర్ గౌతమి అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయ ఎదురుగానున్న అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ భారత జాతికి ఇచ్చిన ఎనలేని సంపద రాజ్యాంగం అని అన్నారు. ప్రాథమిక హక్కులు, అన్ని అంశాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం లేని విధంగా ఎంతో ముందుచూపుతో రాజ్యాంగాన్ని రూపొందించిన మహోన్నతుడు అంబేడ్కర్ అని కొనియాడారు. సమాజంలో అసమానతలు పోయి, సమానత్వం రావాలని ఆశించిన మానవతా మూర్తిగా అభివర్ణించారు. అసమానతలు లేని సమాజాన్ని నిర్మించుకుందామని, ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా భావించి అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిచేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. సమసమాజ స్థాపనలో భాగంగా అన్ని వర్గాల వారికీ న్యాయం చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవులు, పనుల్లో 50 శాతం ప్రాధాన్యత ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు, పార్టీ, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు కీలకం



హోంగార్డులకు బహుమతులు అందజేస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకమని డీఐజీ అమ్మిరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో 61వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఐజీ హాజరై ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ అన్బురాజన్‌తో కలసి వాహనంలో వెళ్లి పరేడ్ పరిశీలించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ పోలీసులకు ఏమాత్రం తీసిపోని విధంగా హైవే పెట్రోలింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ, సీసీటీఎన్ఎస్ చాలా రకాల విధుల్లో హోంగార్డులు కీలకంగా పనిచేస్తున్నారన్నారు. పారదర్శకత, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేసి పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలన్నారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ 1946లోనే హోంగార్డు వ్యవస్థ ఏర్పడిందన్నారు. మతపరమైన అల్లర్లు చెలరేగడంతో వాటి కట్టడి కోసం ఆర్మీ, పోలీసులకు అదనంగా ఫోర్స్ అవసరమని భావించి ఈ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. 1962 చైనా యుద్ధంలో వీరి సేవలు గుర్తించి అప్పటి నుంచి పోలీసుశాఖలో హోంగార్డులను అంతర్భాగం చేశారని తెలిపారు. హోంగార్డుల సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు కూడా పెంచిందన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనపరిచిన హోంగార్డులకు డీఐజీ, ఎస్పీలు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఐటీ కోర్ టీమ్‌లోని డీటీఆర్‌బీ డీసీఆర్బీలో పనిచేస్తున్న ఇబ్రహీం, శివనాగేంద్ర తారక్, రఘును డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కర్‌రెడ్డి, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, డీఎస్పీలు ప్రసాదరెడ్డి, బీవీ శివారెడ్డి, లీగల్ అడ్వయిజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు వ్యాపారి శఠగోపం

- రూ.12 కోట్ల వరకు బకాయిలు
- లబోదిబోమంటున్న బాధిత రైతులు

కణేకల్లు: మాల్యం గ్రామానికి చెందిన ఓ వ్యాపారి రైతులకు శఠగోపం పెట్టారు. శనగలు విక్రయించిన రైతులకు రూ.12 కోట్ల వరకు బకాయి పెట్టి పరారయ్యాడు. మండలంలోని సొల్లాపురం, ఎస్.హనుమాపురం, నింబగల్లు, మాల్యం, తుంబిగనూరు తదితర గ్రామాల్లో సదరు వ్యాపారి రైతుల నుంచి అనామతు(అప్పు)పై శనగలు కొనుగోలు చేశాడు. అయితే డబ్బు చెల్లింపు విషయంలో కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో రైతుల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో రైతుల నుంచి డబ్బుల కోసం ఒత్తిడి పెరగడంతో వ్యాపారి కుటుంబంతో కలిసి ఊరు విడిచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న రైతులు లబోదిబోమంటున్నారు. పలువురు బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

చమన్‌ను చంపించి.. ఫొటోకు దండం పెడతావు

- సేవలు చేసిన వారినే మట్టుబెడతారు
- అధికారంలో ఉన్నపుడు పేదలకు ఏమి చేశావు?
- ఓటు అడిగే అర్హత మీకు ఏమాత్రమూ లేదు
- కలలో కూడా ఇక ఎమ్మెల్యే అవలేవు
- పరిటాల సునీతపై రాప్తాడు నియోజకవర్గ వాసుల ధ్వజం



మాట్లాడుతున్న నసనకోట ముత్యాలు, కుంటిమద్ది ఓబులేసు, రామాంజనమ్మ

రాప్తాడురూరల్: అధికారంలో ఉన్నపుడు నియోజకవర్గంలోని పేదలకు పరిటాల సునీత చేసిందేమీ లేదని కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన రామాంజనమ్మ స్పష్టం చేశారు. పరిటాల రవీంద్ర తండ్రి పరిటాల శ్రీరాములు హత్య జరిగిన సమయంలో అడ్డుకోబోయిన తనతండ్రి వాల్మీకి రామాంజనేయులు కూడా ప్రాణాలు కోల్పోయాడని ఆమె తెలిపారు. ఈ నెల 4న రాప్తాడులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు బ్రహ్మరథం పట్టడాన్ని జీర్ణించుకోలేని పరిటాల సునీత తన వర్గీయులతో ఆరోపణలు చేయిస్తున్నారని విమర్శించారు. బుధవారం ఆమె అనంతపురంలో నసనకోట హరిజన ముత్యాలు, కుంటిమద్ది ఓబులేసుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రామాంజనమ్మ మాట్లాడుతూ పరిటాల కుటుంబానికి వెన్నంటి ఉండి సేవలందించిన చమన్‌సాబ్‌ను చంపించి.. మళ్లీ ఆయన ఫొటోకు సునీత దండం పెడుతోందని మండిపడ్డారు. బీసీలకు ఎంతగా అన్యాయం చేశారో అందరికీ తెలుసన్నారు. ఆమెను ఏ ఒక్కరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. పరిటాల సునీత కలలో కూడా మళ్లీ ఎమ్మెల్యే కాదని స్పష్టం చేశారు. ప్రజలను ఓట్లు అడిగే అర్హత పరిటాల కుటుంబానికి లేదని నసనకోట హరిజన ముత్యాలు, కుంటిమద్ది ఓబులేసు స్పష్టం చేశారు. పరిటాల కుటుంబ రాజకీయాలను బడుగు, బలహీన వర్గాల ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. తప్పుడు స్టేట్‌మెంట్‌లు ఇవ్వడం మానుకుంటే మంచిదని హితవు పలికారు. ఫ్యాక్షన్, కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు.

మూడు ఎన్జీవోలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్

- ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు కేంద్ర మంత్రి రేణుక సింగ్ జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్న మూడు ఎన్జీవోలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు సమకూర్చినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్ సరూతా తెలిపారు. అనంతపురంలోని గ్రామ అభ్యుదయ సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్‌కు రెసిడెన్షియల్ స్కూల్ నిమిత్తం 2020–21లో రూ.6,51,307, 2021–22లో రూ.19,14,030, 2022–23లో రూ.23,06,745, కృష్ణా జిల్లాలోని శ్రీలక్ష్మి మహిళ మండలికి నాన్-రెసిడెన్షియల్ స్కూల్ నిమిత్తం 2020–21లో రూ.5,69,976, 2021–22లో రూ.37,13,750, 2022–23లో రూ.4,33,682, కర్నూలు జిల్లా నవోదయ ఇంటిగ్రేషన్ కల్చరల్ సోషల్ ఎడ్యుకేషన్, వలంటరీ యాక్షన్‌కు రెసిడెన్షియల్ స్కూల్ నిమిత్తం 2022–23లో రూ.1,48,10,373 విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు పరిమళ్ నత్వానీ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఎమ్మెల్యే సేవలను పొగిడినందుకు దాడి

- రుద్రంపేటలో ఘటన
- పరిటాల సునీత వర్గీయుల ఘాతుకం



బాధితుడు సుధీర్‌చౌదరి

రాప్తాడురూరల్: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న సేవల గురించి సమావేశంలో పొగిడిన వ్యక్తిపై మాజీ మంత్రి పరిటాల సునీత వర్గీయులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామ్మూర్తి నాయుడు బంధువులు దాడి చేశారు. బాధితుడి కథనం మేరకు... రామగిరి మండలం మాదాపురం గ్రామానికి చెందిన పతకమూరి సుధీర్ చౌదరి తదితరులు ఐదు రోజుల కిందట కనగానపల్లిలో పేద మహిళలకు ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సమయంలో సుధీర్‌చౌదరికి మాట్లాడే అవకాశం వచ్చింది. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే కాక ముందు, అయిన తర్వాత ఏయే సేవలందించారో వివరించాడు. ఎనుములు, గొర్రెలు, డ్రిప్ ఉచితంగా అందివ్వడంతో పాటు బోర్లు వేయించారని గుర్తు చేశాడు. ఏ సామాజిక వర్గం వారు వెళ్లి అడిగినా తోపుదుర్తి కుటుంబం సాయం చేస్తోందని కొనియాడాడు. చదువుకున్న వ్యక్తి ఎమ్మెల్యే అయితే ప్రకాష్ రెడ్డిలా ఉంటారని వ్యాఖ్యానించాడు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి రెడ్డి సామాజిక వర్గం నేతను మెచ్చుకోవడాన్ని పరిటాల సునీత వర్గీయులు ఓర్వలేకపోయారు. మంగళవారం రాత్రి అనంతపురం శివారులోని రుద్రంపేటలో సుధీర్‌చౌదరి నివాసానికి వెళ్లిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామ్మూర్తి నాయుడు బంధువులు అనిల్, వెంకట్ తదితరులు దాడికి పాల్పడ్డారు. కారును ధ్వంసం చేశారు. ఆరు నెలల్లో తమ ప్రభుత్వం వస్తుందంటూ హెచ్చరించారని బాధితుడు తెలిపాడు. దాడి ఘటనపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

క్లుప్తంగా

అల్లుడి ఘాతుకం

- మామపై కొడవలితో దాడి
- చికిత్స పొందుతూ మృతి



హతుడు సుంకిరెడ్డి

తాడిపత్రి: అల్లుడు కొడవలితో విచక్షణారహితంగా దాడి చేయడంతో మామ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం కోమలి గ్రామానికి చెందిన వీర రాఘవరెడ్డికి శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన సుంకిరెడ్డి(63) కుమార్తె రాజేశ్వరితో వివాహమైంది. కొన్ని రోజులుగా సుంకిరెడ్డి మతిస్థిమితంలో కోల్పోయి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండడంతో అప్పుడప్పుడు ఆ గ్రామానికి సుంకిరెడ్డి చేరుకుని కుమార్తె బాగోగులు చూసుకునే వారు. అల్లుడిని చికిత్స నిమిత్తం ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కోమలికి చేరుకున్న ఆయన వీర రాఘవరెడ్డిని చికిత్స కోసం బెంగళూరుకు పిలుచుకెళ్లి మంగళవారం తిరిగొచ్చారు. బుధవారం ఉదయం అల్లుడికి చెందిన కంది పొలంలో పంటకు పురుగుల మందు పిచికారీ చేయిస్తుండగా అదే సమయంలో అక్కడకు చేరుకున్న వీరరాఘవరెడ్డి కొడవలితో సుంకిరెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన సుంకిరెడ్డిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హిజ్రాపై కేసు నమోదు

కళ్యాణదుర్గం రూరల్: ప్రజలను వేధిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న హిజ్రాపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. కళ్యాణదుర్గానికి చెందిన గాయత్రి మంగళవారం రాత్రి పావగడకు వెళ్లేందుకు సిద్ధమై పిల్లలతో సహా బస్టాండుకు చేరుకుని బస్సు ఎక్కింది. ఆ సమయంలో అదే బస్సు ఎక్కిన హిజ్రా అంకిత డబ్బు కోసం గాయత్రిని తీవ్ర ఒత్తిడి చేసింది. దీంతో అసహనానికి గురైన ఆమె పర్సు తీసి డబ్బు ఇచ్చేలోపు దానిని లాక్కొని అందులోని రూ.500 తీసుకెళ్లింది. దౌర్జన్యాన్ని గాయత్రి నిలదీస్తూ డబ్బు తిరిగివ్వాలని కోరితే తనదైన శైలిలో హంగామా చేస్తూ రాయలేని మాటల్లో దుర్భాషలాడింది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, బలవంతపు వసూళ్లకు పాల్పడే హిజ్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు.

హతమార్చి... ఆపై కాల్చేసి

- సినిమాను తలపించిన యువకుడి హత్య
- ఎట్టకేలకు మిస్టరీని ఛేదించిన పోలీసులు
- 11 మంది అరెస్ట్
- కారు, ద్విచక్ర వాహనాలు, ల్యాప్‌టాప్, మొబైల్‌ఫోన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్ (చిత్రంలో) డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ రెడ్డప్ప



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం: వారిద్దరూ స్నేహితులు. కలసి వ్యాపారం చేసి కష్టాల నుంచి గట్టెక్కారు. అయితే ఊహించని విధంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో కారణం నువ్వంటే నువ్వని నిందించుకున్నారు. అక్కడితో ఆగని ఆక్రోశం చివరకు ఒకరిని మట్టుబెట్టే స్థాయికి చేరుకుంది. ఆద్యంతం క్రైమ్... సస్పెన్స్... థ్రిల్లర్ సినిమాను తలపించేలా సాగిన యువకుడి హత్యకేసులో మిస్టరీని కేవలం వారం రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. నిందితులను కటకటాల వెనక్కు పంపారు. వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు.

మిస్సింగ్ కేసు కింద దర్యాప్తు..

అనంతపురంలోని మున్నానగర్‌కు చెందిన మహమ్మద్ ఆలీ (27) గత నెల 27న మిత్రులతో కలసి బెంగళూరుకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఫోన్ నంబర్‌కు కాల్ చేసినా స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు ఈ నెల 1న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన సీఐ రెడ్డప్ప, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సుధాకర్ యాదవ్... డీఎస్పీ ప్రసాదరెడ్డి నేతృత్వంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ఏఎస్ఐ నాగేశ్వరరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్, ఫరూక్ , అశ్వత్థ, కానిస్టేబుళ్లు మహమ్మద్, ఆసిఫ్, దాసు, మురళి, మోహన్, అమీర్ బృందాలుగా విడిపోయి అండర్ కవర్ ఆపరేషన్ చేపట్టారు. కేసులో తొలుత అనుమానితుడి మహమ్మద్ రఫీక్‌ను అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారణ చేయడంతో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం చేసుకుని ఆలీని హతమార్చి, మృతదేహాన్ని కాల్చేసినట్లు అంగీకరించాడు. దీంతో మిస్సింగ్ కేసును కాస్త హత్య కేసుగా మార్చి లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మొత్తం 11 మంది నిందితులూ పట్టుబడ్డారు.

పట్టుబడింది వీరే..

మహమ్మద్ ఆలీని హతమార్చిన కేసులో తొలుత అనుమానితుడిగా పోలీసులకు పట్టుబడిన అనంతపురంలోని చంద్రబాబు కొట్టాలకు చెందిన మహమ్మద్ రఫీకే ప్రధాన నిందితుడిగా పోలీసులు నిర్ధారించారు. అతనికి సాయం చేసిన మరో పది మందిని పక్కా ఆధారాలతో బుధవారం అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో రఫీక్‌తో పాటు సమీప కుటుంబసభ్యులు అనంతపురంలోని వినాయక్ నగర్‌కు చెందిన షేక్ కరిష్మా, షేక్ సిద్దిక్ ఆలీ, చంద్రబాబు కొట్టాలకు చెందిన షేక్ గౌసియా, రాజీవ్ కాలనీకి చెందిన షాహీనా, మూడో రోడ్డులో నివాసముంటున్న శెట్టూరు మండలం ములకలేడుకు చెందిన కరణం శ్రీనివాస్ ఫణి, శ్రీసత్యసాయి జిల్లా, బత్తలపల్లి మండలం సంగాల నివాసి గుజ్జల శివకుమార్ (సుపారీ గ్యాంగ్‌లీడర్), గుజ్జల హరి, నార్సింపల్లి నివాసి గుజ్జల చంద్రశేఖర్, గుజ్జల కృష్ణ, ప్రస్తుతం ధర్మవరంలో నివాసముంటున్న తాడిమర్రి మండలానికి చెందిన మంగలి కేసన్నగారి రాము అలియాస్ శివరాం ఉన్నారు. వీరి నుంచి మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన నానో కారుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, ఓ లాప్‌టాప్, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.35 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

వివాదంగా మొదలై...

షేక్ మహమ్మద్ రఫీక్, మహమ్మద్ ఆలీ మంచి స్నేహితులు. ఇద్దరూ కలసి రియల్ ఎస్టేట్, పాల్కాన్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ ట్రేడింగ్ కంపెనీ తదితర వివిధ రకాల వ్యాపారాలు చేశారు. ఊహించని విధంగా మార్కెట్‌లో వీరు చేస్తున్న వ్యాపారాలకు డిమాండ్ తగ్గడంతో రూ.లక్షల్లో నష్టపోయారు. ఇందుకు కారణం నీవంటే... నీవంటూ నిందించుకుని, నష్టపోయిన డబ్బును రాబట్టుకునేందుకు ఇద్దరూ పరస్పరం వాగ్వాదానికి దిగేవారు. దీనికి తోడు ఆలీ తరుచూ తన ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులతో వ్యవహరిస్తున్న తీరు కూడా రఫీక్‌లో ఆవేశానికి కారణమైంది. దీంతో వ్యాపారంలో నష్టపోయిన డబ్బు ఎగ్గొట్టడంతో పాటు తన కుటుంబసభ్యుల ప్రశాంత జీవనానికి ఆలీని అడ్డు తప్పించడం ఒక్కటే మార్గంగా భావించాడు.

హత్య చేశారిలా..

ఆలీని హతమార్చాలని నిర్ణయించుకున్న రఫీక్ వెంటనే తన స్నేహితుడు మంగలి కేసన్న గారి రాము అలియాస్ శివరాం సాయాన్ని అర్థించాడు. దీనికి అంగీకరించిన శివరాం తనకు బాగా తెలిసిన సుపారీ గ్యాంగ్‌ను పంపుతానని రూ.50 వేలు అడ్వాన్సు కింద తీసుకుని గుజ్జల శివకుమార్, చంద్రశేఖర్, హరి, కృష్ణను నవంబరు 27న అనంతపురానికి పంపాడు. ఈ నలుగురూ రఫీక్‌తో కలసి మాట్లాడిన తర్వాత వినాయక నగర్‌లోని తన బావ సిద్దిక్ ఆలీకి చెందిన ఫర్నీచర్ గోదాము వద్దకు రావాలని మహమ్మద్ ఆలీకి రఫీక్ ఫోన్ చేశాడు. దీంతో అక్కడకు చేరుకున్న ఆలీపై సుపారీ గ్యాంగ్‌తో కలసి దాడి చేసి కొట్టి, కాళ్లుచేతులు కట్టేశారు. నోటికి, ముక్కుకు ప్లాస్టర్ అతికించి సుపారీ గ్యాంగ్ సభ్యులు వెళ్లిపోయారు. తర్వాత కాసేపటికి ఆలీ చనిపోయినట్లుగా గుర్తించిన రఫీ వెంటనే సిద్దిక్ ఆలీ, కరిష్మాతో చర్చించి మృతదేహాన్ని మాయం చేయడానికి పథకం వేశాడు.

కారు మొరాయించి... తిరిగొచ్చి

గత నెల 27న ఆలీని హతమార్చిన రోజే మృతదేహాన్ని నానో కారులో తీసుకుని నంద్యాల జిల్లా గిద్దలూరు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో పడేసేందుకు రఫీక్, కరిష్మా బయల్దేరారు. మార్గమధ్యంలో కారు మొరాయిస్తుండడంతో వెనక్కు వస్తుండగా శింగనమల మండలం శివపురం వద్దకు చేరుకోగానే కారు ఆగిపోయింది. స్థానికులు గమనించి రోడ్డుపై ఆగిన కారును పక్కకు లాగారు. ఆ సమయంలో వెనుక సీటులో ఉన్న మృతదేహాన్ని గమనించి ఆరా తీయడంతో తమ సోదరుడే మృతి చెందాడని నమ్మించారు. అనంతరం అంబులెన్స్‌ను రప్పించుకుని మృతదేహాన్ని అనంతపురంలోని నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో తాను నూతన నిర్మిస్తున్న ఇంటికి రఫీక్ చేర్చాడు. అప్పటికే చాప, దుప్పటి తెప్పించి మృతదేహం కనపడకుండా కప్పి ఆ ఇంట్లో ఉంచారు. చుట్టుపక్కల ఆరా తీయడంతో తమకు అతి సమీప బంధువు చనిపోయాడని, కుష్టు వ్యాధి ఉండడంతో మృతదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చినట్లుగా నమ్మించారు. అనంతరం నవంబర్ 28వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలీ మృతదేహాన్ని నారాయణపురం సమీపంలోని శ్మశాన వాటికకు తీసికెళ్లి పెట్రోలు పోసి ఆనవాళ్లు లేకుండా కాల్చేశారు.మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన కారును షాహీనా, కరణం శ్రీనివాస్‌ఫణి సాయంతో దాచేశారు. కేసులోని మిస్టరీని ఛేదించి 11 మంది నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ రెడ్డప్ప బృందాన్ని ఎస్పీ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

'ఈ-కార్టు'లో మోసం

- పోలీసుల అదుపులో డెలివరీ బాయ్



డెలివరీ బాయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనంతపురం క్రైం: ఆన్‌లైన్‌లో దుస్తులు కొంటే చిరిగినవి డెలివరీ చేయడంపై కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే తరహాలో మోసపోవడంతో డెలివరీబాయ్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... చియ్యేడు గ్రామ సర్పంచ్ గంగాధర్‌రెడ్డి కుమారుడు పది రోజుల క్రితం ఆన్‌లైన్‌లో బుక్ చేసిన నూతన దుస్తులు ఈ కార్ట్ ద్వారా బుధవారం అందాయి. పార్శిల్‌ను డెలివరీ బాయ్ సమక్షంలోనే వారు తెరిచి చూస్తే అందులో చిరిగిన మసి గుడ్డలు ఉన్నాయి. గతంలోనూ ఇదే తరహాలో పార్శిల్ అందిన వైనాన్ని గుర్తు చేస్తూ డెలివరీ బాయ్‌ను నిలదీశారు. ఆ సమయంలో సరైన సమాధానం చెప్పకుండా బాయ్ తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో కుటుంబసభ్యులు నిర్బంధించి అశోక్ నగర్‌కు చెందిన ఈ-కార్ట్ ఏజెన్సీ నిర్వాహకుడిని పిలిపించి మాట్లాడారు. ఆయన కూడా తమ తప్పిదమేమీ లేదని బుకాయించడంతో డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఈ-కార్టు డెలివరీబాయ్, నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

నిజమైన హీరోలు సైనికులే

- జిల్లా సైనిక సంక్షేమ అధికారి శ్రీనివాసులు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఎన్‌వైకే వలంటీర్లు

అనంతపురం కల్చరల్: నిరుపమాన త్యాగాలతో దేశాన్ని అనుక్షణం కాపాడుతున్న సైనికులే నిజమైన హీరోలని పలువురు వక్తలన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా బుధవారం నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి జె.శ్రీనివాసులుకు ఎన్‌వైకే వలంటీర్లు సైనిక సంక్షేమ నిధికి విరాళాల హుండీలను అందించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సైనిక సంక్షేమ నిధికి ఉత్తమంగా విరాళాలను సేకరించిన యువతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం డీడీఓ శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి భరత్, జీవన్‌కుమార్, మారుతీప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, సైనిక సంక్షేమశాఖ సీనియర్ అసిస్టెంట్ గిరిప్రసాద్, నందిత, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

అనంతపురం క్రైం: వివాహితను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఆమె భర్త, అత్తమామను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం త్రీటౌన్ పోలీసులు వెల్లడించారు. ఈ నెల 3న అనంతపురంలోని రజకనగర్‌లో నివాసముంటున్న వలంటీర్ మాధవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి మాధవి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అదనపు కట్నం వేధింపులతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. ఇందుకు కారకులైన భర్త మారుతి, ఆయన తల్లిదండ్రులను బుధవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ట్రాక్టర్‌ను ఢీ కొని వ్యక్తి మృతి

తాడిపత్రి: చుక్కలూరు సమీపంలో గుత్తి - తాడిపత్రి ప్రధాన రహదారిపై ఆపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు..తాడిపత్రి బంకమడి వీధికి చెందిన యక్కలూరు చిన్నబాబా(30) యాడికిలో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి యాడికిలో షాపు మూసి తాడిపత్రిలోని ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. చుక్కలూరు సమీపంలో రహదారిపై ఆపిన ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొన్నాడు. ప్రమాదంలో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మహబూబ్ జాన్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధన జగన్‌తోనే సాధ్యం



జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, మేయర్ వసీం, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: సమసమాజ స్థాపన కోసం కలలు కన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య అధ్యక్షతన పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా స్వాతంత్ర్య భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా, రాజ్యాంగ శిల్పిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన సేవలను కొనియాడారు. అదే బాటలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నడుస్తూ దళితుల అభ్యున్నతికి పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, కార్పొరేటర్ కమల్‌భూషణ్, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రిలాక్స్ నాగరాజు, రాజారాం, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంట్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకులు చింతా సోమశేఖర రెడ్డి, గౌస్‌బేగ్, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, పెన్నోబులేసు, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాత అంబేడ్కర్

అనంతపురం సిటీ: రాజ్యాంగ కర్తగా దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని నగర అనంతపురం వసీం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్ అన్నారు. జెడ్పీ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం వారు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, మాట్లాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మంజుల, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డీసీసీబీ చైర్ పర్సన్ లిఖిత, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, నగర అధ్యక్షుడు సోము, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు మదన్, నూర్ మహమ్మద్, గౌస్ బేగ్, ధనుంజయయాదవ్, హరిత, పెన్నోబులేసు, రాధ, ఉమ, సులోచన, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కీచక గురువు మాకొద్దు

- ఝాన్సీ లక్ష్మీబాయి స్కూల్ ఉపాధ్యాయుడి వెకిలి చేష్టలు
- టీసీలిచ్చేస్తే మరో స్కూల్‌లో చేర్పిస్తామన్న విద్యార్థుల తల్లిదండ్రులు
- విచారణ చేపట్టిన మున్సిపల్ వైస్ చైర్మన్, ఎంఈఓ, సీఐ

గుంతకల్లు టౌన్: పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువే కీచకుడిగా మారాడు. తన కూతురు వయసున్న విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన గుంతకల్లులోని ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వెలుగుచూసింది. వివరాలు... గుంతకల్లులోని మార్కెట్ వెనుక ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 26 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఏడుగురు విద్యార్థినులు ఉన్నారు. సింగిల్ టీచర్ కలిగిన ఈ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కుళ్లాయప్ప కొన్ని నెలలుగా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో విసుగు చెందిన విద్యార్థినులు విషయాన్ని మంగళవారం తల్లిదండ్రుల వద్ద మొరబెట్టుకుని తాము ఆ స్కూల్‌కు వెళ్లబోమంటూ మొరాయించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ మస్తాన్‌రావు ఆ స్కూల్ వద్దకు చేరుకుని విచారణ చేస్తుండగా పలువురు తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని తమ పిల్లలకు టీసీలిచ్చేస్తే మరో స్కూల్‌లో చేర్పించుకుంటామంటూ విన్నవించారు. దీనిపై స్పందించిన మస్తాన్‌రావు సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని భరోసానివ్వడంతో వివాదం అప్పటికి సద్దుమణిగింది. అయితే ఆ ఉపాధ్యాయుడిని బదిలీ చేయకుండా యథావిధిగా కొనసాగిస్తున్నారని తెలుసుకున్న తల్లిదండ్రులు బుధవారం ఉదయం పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతిరెడ్డి వెంటనే వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్యతో కలసి పాఠశాల వద్దకు చేరుకుని, ఆందోళనకారులతో చర్చించారు. జరిగిన దుశ్చర్య తెలుసుకుని సదరు ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు బదిలీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేయాలని ఎంఈఓకు సూచించారు. దీంతో డిప్యుటేషన్‌పై కుళ్లాయప్పను మరో పాఠశాలకు బదిలీ చేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. కాగా, ఘటనకు సంబంధించి ఉపాధ్యాయుడు కుళ్లాయప్ప వివరణ ఇస్తూ తనను విద్యార్థినులు తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. క్లాస్‌రూమ్‌లో అల్లరిని నియంత్రించడంలో భాగంగా ఓ విద్యార్థిని చెయ్యి తగలడంతో మిగిలిన పిల్లలు చూసి దుష్ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

జనవాక్కు

జీవనోపాధి మెరుగు పడింది



డ్రాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉంటూ బ్యాంక్ లింకేజీ రుణం తీసుకున్నా. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రుణమాఫీ డబ్బు పడడంతో నా భర్త, కోడలు సహకారంతో మా ఊళ్లోనే ఓ చిన్నపాటి దుకాణం నడుపుతున్నా. అవసరమైన సరకులను బాగేపల్లి, చిలమత్తూరు, హిందూపురం నుంచి తీసుకొస్తున్నాం. ఇప్పుడు మా జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలు మా కుటుంబానికి కలిసొచ్చాయి. ఆర్థిక ఇబ్బందులు తొలిగిపోయాయి.

– లక్ష్మీదేవమ్మ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

సొంతిల్లు మంజూరైంది



పదేళ్ల క్రితం పెళ్లి చేసుకుని అత్తారింట్లో కాలుపెట్టాను. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. గత టీడీపీ ప్రభుత్వంలో సొంతింటి కోసం లెక్కకు మించి అర్జీలు ఇచ్చాను. జన్మభూమి కమిటీ సమావేశాల్లో ఇచ్చిన ప్రతి దరఖాస్తూ చెత్త కుప్ప పాలైంది. కానీ ఇల్లు మాత్రం మంజూరు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత సంక్షేమ పథకాలతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. నా పేరుతో ఇంటి పట్టా ఇవ్వడమే కాక, గృహ నిర్మాణాన్నీ మంజూరు చేశారు. ప్రస్తుతం గృహ నిర్మాణం పూర్తి కావొస్తోంది. మాకు మేలు చేసిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా.

– అంజలి, తెనగల్లు, కుందుర్పి మండలం

సొంతింటి కల నెరవేరింది



మాది ఉమ్మడి కుటుంబం. ఇరుకు ఇంట్లోనే ఇబ్బంది పడుతున్నాం. గతంలో పక్కా ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సొంతంగా ఇంటిని నిర్మించుకోలేక పోయాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీలో మాకు నివేసన స్థలం ఇచ్చి, గృహ నిర్మాణాన్ని మంజూరు చేశారు. ఇల్లు నిర్మించుకున్నాం. సొంతింటి కల నెరవేరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేలు మరవలేం.

– లక్ష్మీబాయి, కూడేరు

ఇంత గొప్ప సీఎం ఎన్నటికీ రాడు



ఈ చిత్రంలో మీరు చూస్తున్న వ్యక్తి పేరు రాఘవేంద్ర. కుందుర్పి మండలం కెంచంపల్లి గ్రామం. పుట్టకతోనే మూగ, చెవుడుతో బాధపడుతున్నాడు. అదే వైకల్యంతో బాధపడుతున్న యువతిని పెళ్లి చేసుకున్నాడు. ప్రభుత్వం, ఆర్డీటీ సహకారంతో బీటెక్ పూర్తి చేశాడు. జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇద్దరికీ సామాజిక పింఛన్ అందుతోంది. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద మందులు, వినికిడి యంత్రాలు ఇచ్చారు. ఈ క్రమంలో సీఎం జగన్ పాలనపై ఆయన పేపర్లో రాస్తూ.. ఇంతటి గొప్ప ముఖ్యమంత్రి ఎన్నటికీ రాడని, జగన్ లాంటి వ్యక్తి మనకు సీఎం కావడం అందరి అదృష్టమని పేర్కొన్నారు.

వలంటీర్‌పై దాడి



బాధితురాలు లక్ష్మీనరసమ్మ

తాడిపత్రి టౌన్: మండలంలోని గంగాదేవిపల్లి గ్రామ వలంటీర్ లక్ష్మీనరసమ్మపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రవి దాడికి తెగబడ్డాడు. వలంటీర్ పోస్టుకు రాజీనామా చేసి భర్త గంగప్రసాద్‌తో కలసి టీడీపీ కార్యకలాపాల్లో పాల్గొనాలంటూ కొంత కాలంగా బెదిరింపులకు దిగేవాడు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం వార్డులో విధులు నిర్వర్తించేందుకు వెళుతున్న లక్ష్మీనరసమ్మను అడ్డుకుని తన మాట వినకపోతే చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. అతని మాటలు పట్టించుకోకుండా ఆమె ముందుకు సాగడంతో వెనుక నుంచి వీపుపై పిడిగుద్దులతో విరుచుకుపడ్డాడు. స్థానికులు వెంటనే జోక్యం చేసుకుని దాడి నుంచి లక్ష్మీనరసమ్మను కాపాడారు. ఘటనపై బాధితురాలు తాడిపత్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సమస్యల పరిష్కారం కోసమే 'జగనన్నకు చెబుదాం'



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అధికారులు

కుందుర్పి: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం' గ్రీవెన్స్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోందని డిప్యూటీ కలెక్టర్లు వరప్రసాద్, సుధారాణి పేర్కొన్నారు. బుధవారం కుందుర్పిలోని ఆర్‌బీకే సెంటర్‌లో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డితో కలసి వారు పాల్గొని వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పరిశీలన అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత శాఖ అధికారికి సూచించారు. కార్యక్రమంలో డీఈఓ నాగరాజు, డీఎల్‌పీఓ శంకర్, డీపీఓ ప్రభాకర్‌రావు, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజు, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



జెడ్పీలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, చిత్రంలో డిప్యూటీ సీఈఓ లలిత



జేఎన్‌టీయూ అనంతపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన దృశ్యం



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, తదితరులు

అనంతపురం సిటీ: ప్రభుత్వ ఉద్యోగులు అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రజలకు సేవలందించాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కోరారు. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల్లో సాంఘిక, రాజకీయ, విద్య రంగాల్లో చైతన్యాన్ని నింపారని గుర్తు చేశారు. అసమానతలు, అంటరానితనం లేని సమాజం కోసం అహర్నిశలు కృషి చేశారని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ లలితాబాయి, జెడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మర్తాడు షేక్ రఫీ పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగుల జీవితాలు మార్చేందుకు ఆనాడు అంబేడ్కర్ రాజ్యాంగం రచించారన్నారు. కార్యక్రమలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, వాసు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, నాయకులు రామచంద్ర, శంకర్, మల్లికార్జున, కేశవ, రామకృష్ణ, ఈశ్వరయ్య, ఇర్ఫాన్, గణేష్, నారాయణ స్వామి, ప్రతాప్,హరి, చిన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబిలేసు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గడ్డం ముత్యాలప్ప, సురేష్, తిమ్మరాజు, శివలింగ మూర్తి, మల్లేష్, సుగమంచి శ్రీనివాసులు, వెంకటేష్,పెద్దయ్య, చిన్న ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, చిరంజీవి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మల్లారెడ్డి అంకాలు రెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కుమ్మర ఓబుళపతి పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా సీఎం జగన్ సంస్కరణలు ప్రవేశపెట్టి సఫలీకృతులయ్యారని కొనియాడారు.

అనంతపురం: భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ బి. ఈశ్వర రెడ్డి, ప్రొఫెసర్ ఏ. సురేష్ బాబు, ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ ఎస్.విశాలి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్కేయూ అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య నివాళులర్పించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దేవరాజు, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర వర్సిటీల కన్వీనర్ యనుమల ప్రసాద్, మారెన్న, రాజమోహన్ పాల్గొన్నారు. బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ హేమలత నివాళులర్పించారు. కార్యక్రమంలో పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, నాగరాజు, సర్దానప్ప, వెంకటేష్, వెంకటేష్, పెద్దన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన అనంతపురం క్రీడాకారులు

అనంతపురం: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వేదికగా ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా సబ్-జూనియర్స్, క్యాడెట్స్ బాలబాలికల తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. శ్రీభవిష్య బంగారు పతకాన్ని, పి.యశస్వినిరెడ్డి కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు.

గుండెపోటుతో డీలర్ మృతి



దోలు వెంకటేష్ (ఫైల్)

రాప్తాడురూరల్: పాతూరు కూరగాయల మార్కెట్‌కు వెళ్లిన స్టోర్ డీలర్ గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌కు చెందిన డోలు వెంకటేష్ (65), రమాదేవి దంపతులు. వీరు ప్రభుత్వ చౌకధాన్య డిపో నిర్వహిస్తున్నారు. అలాగే కిరాణ అంగడి కూడా ఉంది. వెంకటేష్ రోజూ 4:30 గంటలకు అనంతపురం పాతూరు మార్కెట్‌కు వెళ్లి కాయగూరలు తెచ్చేవాడు. బుధవారం తెల్లవారుజామున మార్కెట్‌కు వెళ్లాడు. అక్కడ గుండెనొప్పి వచ్చి పడిపోయాడు. అక్కడున్న వారు హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గంమధ్యలో మృతి చెందాడు. వజ్రకరూరు మండలం రాగులుపాడుకు చెందిన వెంకటేష్ కుటుంబం ఇక్కడికి వలస వచ్చారు. సీఎస్‌డీటీ బాషా, వీఆర్ఓ రమేష్, సర్పంచ్ బండా అంజియాదవ్, డీలర్లు రామాంజనేయులు, అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ గౌస్ తదితరులు సంతాపం తెలిపారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం



మాట్లాడుతున్న మేయర్ వసీం



అరవిందనగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న చవ్వా రాజశేఖర్ రెడ్డి

- మేయర్ వసీం
- కొనసాగుతున్న వై ఏపీ నీడ్స్ జగన్

అనంతపురం కార్పొరేషన్: 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు నాయుడు ప్రజలకు ఎటువంటి మేలు చేయలేదు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మరోసారి బుద్ధి చెప్పాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 58వ సచివాలయం పరిధిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలసి మేయర్ వసీం ప్రారంభించారు. సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీల అమలులో నిబద్ధత పాటించారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలోని 98 శాతంపైగా హామీలను నెరవేర్చారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మోసాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే సీఎంగా మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉండాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి పారదర్శకంగా పథకాలందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత చవ్వా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అరవింద నగర్‌లోని 47వ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్ అధ్యక్షుడు ఓబీరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధుతో కలసి సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. సచివాలయ పరిధిలో రూ.18 కోట్లకుపైగా లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు ఇషాక్, క్లస్టర్ అధ్యక్షుడు మధు, జగదీష్, రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు వీరారామకృష్ణా రెడ్డి, నాయకులు రియాజ్, నాగార్జున రెడ్డి, బీమా, లక్ష్మీజి పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరులో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సచివాలయం వద్ద పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత అవసరమో నాయకులు వివరించారు. అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, వైస్ సర్పంచ్ కేపీ ఓబులేసు, ఎంపీటీసీ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్‌లు గార్లదిన్నె కృష్ణయ్య, సావిత్రిశ్రీనివాసులు, గురుప్రసాద్, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, నాయకులు పూలకుంట భాస్కర్‌రెడ్డి, ఈశ్వరయ్య, స్థానిక నాయకులు జయచంద్రారెడ్డి, హోతూరు సుధీర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చారు..

ఆత్మకూరు: సీఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని ఎంపీపీ హేమలత అన్నారు.



కందుకూరులో మహిళకు కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరు మండలం సనప సచివాలయం వద్ద పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

బుధవారం మండలంలోని సనప గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పంచాయతీకి చేకూరిన లబ్ధిని వివరించి, పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మినరసింహులు,వైస్ ఎంపీపీ విజయ్,రంగంపేట సర్పంచ్ ఉజ్జినప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, భాస్కర్, యల్లప్ప, రామాంజినేయులు, కృష్ణారెడ్డి, వెంకటార్జున, శీనప్ప, పూజారి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: ఇటీవల రాప్తాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం కావడంతో టీడీపీ నాయకులు ఓర్చుకోలేకపోతున్నారు. బస్సుయాత్రకు వచ్చిన అశేష జనవాహినిని చూసి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ విలేకరులతో మాట్లాడారు. పసుపుల నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. కురుబ, బోయలను పరిటాల సునీత ఓటు బ్యాంకుగా వాడుకుని మోసం చేసిందన్నారు. నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆత్మకూరు జెడ్పీటీసీగా వాల్మీకి కులానికి చెందిన బోయ గిరిజమ్మకు ఇచ్చి, జెడ్పీటీసీగా గెలిపించి, ఏకంగా జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా ఎంపిక చేసింది తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో వాల్మీకి కులానికి చెందిన మహిళలను ఎంపీపీలుగా చేశారని గుర్తు చేశారు. అలాగే రాప్తాడు, కనగానపల్లి, రామగిరి మండలాల్లో కురుబ కులానికి చెందిన వారిని జెడ్పీటీసీలుగా గెలిపించుకున్నారన్నారు. ఆత్మకూరు మండలానికి చెందిన కురుబ కులానికి చెందిన మహిళ ఎంపీపీ ఎంపిక కావడంలో కీలకపాత్ర పోషించారని వెల్లడించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా గొర్రెల, మేకల సహకార సొసైటీ చైర్మన్‌గా నన్ను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అనంతపురం రూరల్ మండల ఎంపీపీగా ఎస్టీ మహిళ, అనంతపురం రూరల్ జెడ్పీటీసీగా ఎస్సీ కులానికి చెందిన యువకుడు, రాప్తాడు, రామగిరి మండలాలకు ఇద్దరు ఎస్సీలకు వైస్ ఎంపీపీలుగా ఎమ్మెల్యే చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా ఇతర రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ, సర్పంచులుగా ఎమ్మెల్యే బడుగు, బలహీన వర్గాల వారికి సామాజిక సాధికారతకు ఇదే నిదర్శనమని స్పష్టం చేశారు. అదే టీడీపీ అరాచక పాలనలో బడుగు, బలహీన వర్గాలకు అనంతపురం జిల్లాలో ఒక మంత్రి పదవి కూడా ఇవ్వకుండా, ఐదు సంవత్సరాల పాటు పరిటాల సునీత మంత్రిగా ఉందన్నారు. కురుబ కులానికి చెందిన కనగానపల్లి మండల ఎంపీపీ బిల్లే రాజేంద్రను నానా ఇబ్బందులకు గురి చేసి, పదవి నుంచి తప్పించి తమ కమ్మ సామాజిక వర్గానికి చెందిన (వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీటీసీగా గెలిచిన) కమ్మ సరిపూటీ పద్మ గీతను కనగానపల్లి ఎంపీపీగా చేసింది పరిటాల సునీత కాదా అని ప్రశ్నించారు. ఈ మధ్య కాలంలో కురుబ కులానికి చెందిన చిత్ర మురళి అనే యువకుడిని మీ కమ్మ సామాజిక వర్గ అమ్మాయి పెళ్లి చేసుకోవడంతో అది ఒర్వలేక కమ్మ సామాజిక వర్గం వారు చిత్రా మురళిని అత్యంత్య దారుణంగా హత్య చేయలేదా అని మండిపడ్డారు. రాప్తాడు పండమేరు వంకలో బోయ కులానికి చెందిన ఓయ ఓబులేషను అత్యంత దారుణంగా గాయపరిచినది మీ కమ్మ సామాజిక వ్యక్తులే అన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఆత్మకూరు జెడ్పీటీసీగా గెలిచిన ఎస్సీ కులానికి చెందిన కుళ్లాయప్పనూ బెదిరింపులతో టీడీపీలోకి చేర్పించుకున్నారని ఆరోపించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి నియోజకవర్గంలో రూ.10 కోట్ల సొంత నిధుల వెచ్చించి అమ్మ డెయిరీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ డెయిరీ ద్వారా 10 వేల మంది మహిళలకు ఉపాధి దొరుకుతుందన్నారు.

30 వేల మందికి ఇళ్లు మంజూరు..

మండల కన్వీనర్ జూటూరు శేఖర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దాదాపు 44 గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు మీ టీడీపీ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి పేరు మీద టెండర్లు వేసుకుని ఆ రహదారుల నిర్మాణాలు జాప్యం చేస్తున్నది నిజం కాదా అన్నారు. టీడీపీ పాలనలో నియోజవర్గానికి 2 వేలు ఇళ్లు మంజూరైతే.. వైఎస్సార్‌సీపీ పాలనలో 30 వేల మందికి ఇళ్లు మంజూరు చేసి వారికి ఇళ్లు కట్టిస్తున్నామన్నారు. ఇంతటి అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే, ఆయన కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సామాజిక సాధికార బస్సుయాత్ర గురించి మాట్లాడే అర్హత పరిటాల సునీత, టీడీపీకి లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంజి, సల్లప్ప, రామలింగమయ్య, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే చరిత్రాత్మకం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణన సర్వేకు ప్రజాప్రతినిధులు, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్లు, ఈడీలు, కుల సంఘాల నుంచి సానుకూల స్పందన వచ్చింది. కలెక్టర్ గౌతమి ఆదేశాలతో కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి బుధవారం నగరపాలక సంస్థలో కులగణన సర్వేలో భాగంగా ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కమిషనర్, అదనపు కమిషనర్ రమణారెడ్డి కులగణన సర్వేను ఏవిధంగా చేపట్టనున్నారని, యాప్‌లో ఏ వివరాలను నమోదు చేస్తారో తదితర వివరాలను ప్రొజెక్టర్ ద్వారా తెలియజేశారు. వలంటీర్, సచివాలయ కార్యదర్శి ఇంటింటికి వచ్చి సర్వే చేపడుతారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. 92 ఏళ్ల తర్వాత సర్వే చేపట్టడం ద్వారా అన్ని కులాలకు సంక్షేమ పథకాలను చేరువచేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజన్ కల్గిన సీఎం అని, దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందించారన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కులగణన పక్కాగా జరిగేందుకు సర్వేకు మరింత సమయం కేటాయించాలన్నారు. ఇతర రాష్ట్రం నుంచి వలస వచ్చి బుడ్డప్పనగర్‌లో నివాసముండే నీలిషికారీలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కార్పొరేటర్ లీలావతి పేర్కొన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కార్పొరేటర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ.. పాలసీకి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు చంద్రమోహన్ రెడ్డి, లాలెప్ప, బాలాంజినేయులు, రామాంజినమ్మ, సుమతి, జేడీ సోషియల్ వెల్ఫేర్ మధుసూదన్ రావు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బు కొఠారి, నాయిబ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉప్పర-సగర నవీన్‌కుమార్, సీపీఐ బాషా, ఈఎండీ ఇమామ్, ఎస్సీ, ఎస్టీ వీరాంజినేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

కనగానపల్లి: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు కదిరప్ప ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులతో కలసి తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి.లక్ష్మీదేవి, వనిత, అనిత, రమాదేవి, లక్ష్మీదేవి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక సోమనాథ్ నగర్ కోదండ రామాలయంలో రెండు రోజుల పాటూ సాగే విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల కృష్ణమూర్తి స్వామి, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు మణూరు నాగరాజు, ఉమారాణి తదితరులు నాగదేవతలు, వేదస్తూపం విగ్రహాలకు పూజలు చేశారు. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి ప్రత్యేకంగా తయారు చేయించిన విగ్రహాలను గురువారం ఉదయం వారి చేతుల మీదుగానే ప్రాణప్రతిష్ఠలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలియజేశారు.

చిత్రలేఖన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తుననట్లు వేదిక కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంత జీవన స్థితిగతులు, సంస్కృతి, ప్రకృతి, సమకాలీన సమస్యల నేపథ్యంలో చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు. ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారకంగా నిర్వహిస్తున్న పోటీల్లో జేతలకు రూ.10 వేలు విలువ చేసే బహుమతులు అందజేస్తామని తెలిపారు. జనవరి 31లోపు 9962544299 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అయ్యప్పకు పూజలు

అనంతపురం కల్చరల్: పాతూరు చెరువుకట్టపై వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం ఉత్సవ పూజలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటూ సాగే వేడుకల్లో తొలిరోజు శబరిమల ప్రధాన పూజారి రాజీవ్ తంత్రి శిష్య బృందం ఆధ్వర్యంలో జెండా స్థాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మణికంఠ గౌతం మాట్లాడుతూ.. 7న నగర వీధుల్లో గ్రామోత్సవం జరుగుతుందని వందలాది మంది బాలికలు హారతులతో శోభాయాత్ర నిర్వహిస్తారన్నారు. 8న అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి బోనా నాగలింగారెడ్డి, గజేంద్ర మోహన్, నాగానందం, కల్లూరు రాము, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

రాప్తాడు: ఈవీఎంలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ మనివేలు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. పోలింగ్ రూంలోకి వెళ్లిన తర్వాత ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలో ప్రత్యక్షంగా వివరించారు.

క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సత్తా



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల కెమికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 9 మంది విద్యార్థులు డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన తెలిపారు. ప్రతిభ చాటి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వీసీతో పాటు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అభినందించారు. ఉద్యోగాలు సాధించిన వారిలో కే.సాయి దీక్షిత్ రెడ్డి, ఎం.మాధురి, ఏ.జయంత్ కుమార్ రెడ్డి, ఆర్.మీనాక్షి, వై.లక్ష్మీ ప్రసీద, పి.అయూబ్ ఖాన్, ఎస్.తేజ, ఎన్.తిరువసాగన్, ఏ.అరుణ్ కుమార్ ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేద్దాం



కిట్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాప్తాడు: డిసెంబర్ 15 నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల వారీగా ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడా సామగ్రిని పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఐదు క్రీడాంశాలలో (క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీ బాల్) పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. 15 సంవత్సరాల వయస్సు నిండిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున, గొర్రెలు, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిప్పు విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటాం



మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలో సప్తగిరి సర్కిల్‌లో టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే బీజేపీ అడ్డుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్‌లో సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కొంత మంది మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఎంత మంది అడ్డుపడినా పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామన్నారు. టిప్పు సుల్తాన్ పుట్టిన మైసూరులో కూడా టిప్పు విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. పది రోజుల్లో పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు చిరంజీవి రెడ్డి, అంకాల్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మల్లరెడ్డి, అశోక్‌రెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

బీజేపీవి మత రాజకీయాలు

- డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి



అనంతపురం కార్పొరేషన్: భారతీయ జనతా పార్టీకి మతపరమైన రాజకీయాలు చేయడం ఆనవాయితీగా వస్తోందని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నగరపాలక సంస్థలో మీడియాతో ఆయన మాట్లాడారు. అనంతపురంలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేస్తే బీజేపీ నేతలకు అభ్యంతరం ఏమిటో చెప్పాలన్నారు. టిప్పు సుల్తాన్‌ను ఒక మత వ్యతిరేకిగా చిత్రీకరించే ప్రయత్నం బీజేపీ చేస్తోందన్నారు. బీజేపీ నాయకులు సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటు చేసుకోవచ్చని, దానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. నగరంలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అబూసలేహ్ పాల్గొన్నారు.

ఫార్మా-డీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో నిర్వహించిన ఫార్మా-డీ ఒకటో సంవత్సరం (ఆర్-17) రెగ్యులర్, సప్లిమెంటరీ, (ఆర్-14) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ (ఏ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.